# శ్రీమతి

'కిన్నెర'



"ఓహ్... మార్వలెస్....ఆ కళ్ళే కళ్ళు-

నల్లటి చక్రాల్లా-అవి కదూ నన్ను నీ చుట్టూ తిప్పుకున్నవి.... నీ అధరాలు- అప్పుడే విరిసిన గులాబీ రేకుల్లా పల్చగా ఎర్రగా .... నీ అధరాలమీద విరిసే వెన్నెలకోసం ఎన్నిసార్లు నీ వడిలో తల వాల్చుకోలేదు.... ఆ సన్నని నడుం.... పిడికిల్లో ఇరుక్కునేట్లు.... కందిపోయే టట్లు ఆ తనువు .... అబ్బా నేను పిచ్చి వాడ్నయిపోతున్నా.... ప్చ్ (ముద్దు).

అలికిడవ్వటంతో "ఫోటో"ని బనీను జేబులో దాచేశాడు, కృష్ణమూర్తి. కళ్ళ జోడు సర్దుకొని చూశాడు.

ఇంకెవరు? - గుమ్మం పట్టని భారీ శరీరంతో ధుమధుమ లాడుతున్న ముఖం- రాజేశ్వరి - అతని శ్రీమతే!

"అమ్మో! అమ్మో! నాకొంపముంచేశా ర్నాయనో .... ఇంకేముంది ఈ కొంప నిలవదురో...."

"అదేమిటే ఇల్లుకేం, బాగానే వుందిగా." తలకాయ ఒకసారి భూమిలా గుండ్రంగా తిరిగింది.

"బాగానే వుంటుంది.... ఎందు కుండదు.... అమ్మో.... ఇంత వయ సొచ్చింది.... ఇవేం బుద్ధులో...."

"ఏమిటే నీ గోల! చంపక సరిగ్గా ఏడు"

"ఏమిటీ గోలా?!....అవును గోలే!... నేను మాట్లాడేది ప్రతిదీ గోలే .... చెప్పండి ఎవతది... మీ ఆఫీసులోదేనా... మీకు అంత పిచ్చెక్కిస్తోందా .... అదా కారణం!.. ఎంత నాటకం! ఎంత నాటకం! రాత్రుళ్ళు ఆలస్యంగా వస్తూ ఆఫీసులో పనెక్కువని చెబుతారా? అమ్మో నంగ నాచి.... మగాళ్ళ కబుర్లు తెలియవను కోకండి...ఎంత మోసానికైనా సిద్ధమే... ఇన్నాళ్ళూ ఆ మాయలోనే పడిపోయా... ఇప్పుడు తెలుస్తోంది...."

"ఛ నోర్ముయ్!" అసహనంగా అరిచాడతను.

"ముయ్యకపోతే? .... అవును మీరే శాశ్వతంగా మూయించేస్తారు .... దా న్నేకంగా ఇంటికే తీసుకొచ్చేస్తారు. తెలు స్తూనేవుంది-ఆ ఫోటోని అలా చూడటం, ముద్దులు పెట్టుకోవటం—ఛీఛీ,..ముందా ఫోటో ఇలా ఇవ్వండి" విసురుగా చేతిని భర్తమీదకు విసిరింది రాజేశ్వరి.

"నేనివ్వను." గబుక్కున అతని చేయి బనీను జేబుపై కెళ్ళింది.

"ఇస్తారా లాక్కోమన్నారా?" అంటూనే మీదపడి అతని రెండుచేతుల్ని బలవంతగా ఎడంచేత్తో లాగేసి కుడిచేత్తో ఫోటోని జేబులోంచి బయటకు లాగే సింది.

కృష్ణమూర్తి తలవంచుకున్నాడు.

ఆమె ముఖంలో రంగులు మారాయి.

"అరే ఇది నా ఫోటోలా వుందే?!"

చటుక్కున తల ఎత్తి అన్నాడు— "వుండటమేమిటి అది....నీ ఫోటోయే... మనం ప్రేమించుకున్న కొత్తలో నాకు 'ప్రేమ'తో ఇచ్చావ్! వెనక చూసుకో ఉంటుంది- ప్రేమతో 'రాజా' అని.... ఏవో గత స్మృతులు నెమరువేసు కుంటుంటే ఇంత రాద్ధాంతం చేశావ్.... నీకు వయసు పెరిగేకొద్దీ ఒళ్ళు పెరిగి పోయి బుర్ర తగ్గిపోతోంది.

———